క్లుప్తంగా

స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలి



రోడ్లు ఊడుస్తూ నిరసన తెలుపుతున్న స్వీపర్లు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక జెడ్పీ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్న స్వీపర్లు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. జెడ్పీ కార్యాలయం నుంచి గడియారం సెంటర్ వరకు గంట కొడుతూ రోడ్లను ఊడ్చుకుంటూ నిరసన తెలిపారు. కార్యక్రమలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, సైదాచారి, గంజి నాగరాజు, పనస నర్సింహాగౌడ్, సత్తార్, ఎల్లయ్య, ఆనీఫ్, పూలమ్మ, ఎం.నాగయ్య, లింగయ్య, దేవి పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌పై అవగాహన సదస్సు

కనగల్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ విధానంపై మండల పరిధిలోని ధర్వేశిపురం, పర్వతగిరి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ఎర్రమద విగ్నేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజూ రెండు గ్రామాల్లో ఓటింగ్ విధానంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలని దీక్ష

మాడుగులపల్లి : గత ఎన్నికల ప్రచార సమయంలో ఇందుగుల గ్రామాభివృద్ధికి నల్లగొండ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆ గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ భీమ్– దీక్ష పేరుతో స్థానికంగా శనివారం నిరసన దీక్ష చేపట్టారు. దీక్షలో దారమళ్ల నాగరాజు, పందిరి రాజశేఖర్, సాయి, శ్రీకాంత్, శివ, హరికృష్ణ, నరేష్, దాసరి నాగరాజు పాల్గొన్నారు.

మల్లారెడ్డి ఆశయసాధనకు కృషి చేయాలి



మల్లారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

శాలిగౌరారం : తెలంగాణ సాయుధ గెరిల్లా రైతాంగ పోరాటయోధుడు యానాల మల్లారెడ్డి ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఇందూరు సాగర్ అన్నారు. మండలంలోని ఊట్కూరు గ్రామంలో రాత్రి మల్లారెడ్డి 21వ వర్ధంతిని ఆపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కార్యదర్శి రావుల లింగయ్య, రైతుకూలి సంఘం జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బొంగరాల నర్సింహ, ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిలివేరు జానయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు కప్పల విజయ, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు బండారు వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాలరాజు

నల్లగొండ టౌన్ : జనాభా ప్రాతిపదికన రాజ్యాధికారంలో వాటా సాధనకు ఈనెల 13న హైదరాబాద్‌లో నిర్వహించే యాదవ యుద్ధభేరి సభను యాదవులు జయప్రదం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఈరటి బాలరాజు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని యాదవ సంఘం భవనలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వేదిక జిల్లా నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో బొబ్బల గోపాలకృష్ణయాదవ్, అలివేణు యాదవ్, గుండెబోయిన జానయ్యయాదవ్, అజయ్‌కుమార్‌యాదవ్, శివలింగంయాదవ్, సత్యనారాయణయాదవ్, సైదులుయాదవ్, వెంకన్నయాదవ్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

నల్లగొండ రూరల్ : ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు బిల్లును గవర్నర్‌కు పంపగా అందుకు ఆమోదించకపోవడంతో ఆర్టీసీ కార్మికులు శనివారం ఉదయం 6గంటల నుంచి 8గంటల వరకు నల్లగొండ బస్టాండ్‌లో బంద్ నిర్వహించారు. అనంతరం డిపో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 8గంటల తర్వాత విరమించడంతో బస్సులు యథావిధిగా కొనసాగాయి. ఉదయం వివిధ కార్యాలయాలకు, పాఠశాలలకు వెళ్లేవారు అసౌకర్యాలకు గురయ్యారు. నిరసనలో భువనగిరి నరేందర్, వెంకన్న, అన్వర్‌అలీ, దయాకర్, కవిత, జయమ్మ, లక్ష్మి, శంకరమ్మ ఉన్నారు.

లోలెవల్ వంతెనలతో ఇక్కట్లు

- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



కేతేపల్లి నుంచి మూసీ వెళ్లే దారిలో రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)



గుడివాడ–మేడిపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జి పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

కేతేపల్లి : మండలంలోని పలు గ్రామాల మధ్య వాగులపై నిర్మించిన లోలెవల్ వంతెనలతో ప్రయాణికులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. వర్షాలు వచ్చినపుడు రాకపోకలకు ఆటంకం లేకుండా చెరువుల అలుగులు, వాగుల నుంచి వరద నీరు వెళ్లేందుగా వీలుగా మండలంలోని కొర్లపహాడ్– ఇప్పలగూడెం, గుడివాడ–మేడిపల్లిగూడెం, కేతేపల్లి–కొత్తపేట, కొత్తపేట–కాసనగోడు, కొప్పోలు–భీమారం, తుంగతుర్తి–చెర్కుపల్లి గ్రామాల మధ్య రోడ్డుపై లోలెవల్ వంతెనలను నిర్మించారు. ముందు చూపు లేకుండా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా ఈ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడంతో వరద ఉధృతి ఎక్కువైనప్పుడల్లా ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. కొద్దిపాటి వర్షానికే బ్రిడ్జిల పైనుంచి వరదనీరు ప్రవహిస్తుంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. ఇదిలా ఉండగా రోడ్డు వెడల్పు చిన్నగా ఉండటం, వాహనాలు తిరిగి వెళ్లడానికి వీలు కాకపోవడంతో వరద ఉధృతి తగ్గే వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. వరద ప్రవాహాన్ని అంచనా వేయలేక బ్రిడ్జి పైనుంచి దాటే ప్రయత్నంలో పలువురు గల్లంతు కాగా వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకపోయిన సంఘటనలు ఉన్నాయి. గతంలో కేతేపల్లి– కొత్తపేట గ్రామాల మధ్య ఉన్న బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరదనీటిలో బైక్‌పై దాటే ప్రయత్నంలో కాసనగోడు గ్రామానికి చెందిన భార్య, భర్తలు కొట్టుకుపోయారు. భర్త అతికష్టం మీద బైటపడి ప్రాణాలు దక్కించుకోగా భార్య వరదలో కొట్టుకపోయి మృతి చెందింది. గుడివాడ–నోముల మధ్యన గల వంతెనపై వరద ఉధృతికి కారు గల్లంతయ్యింది.

విద్యార్థులకు, కూలీలకు తప్పని తిప్పలు..

మండల కేంద్రం కేతేపల్లి–కొత్తపేట గ్రామాల మధ్య మూసీ కుడి కాల్వ పక్కన ఉన్న బ్రిడ్జి లెవల్ మరీ చిన్నదిగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే వరదనీరు బ్రిడ్జి పైనుంచి వెళ్తుంది. దీంతో చదువుల కోసం వెళ్లే బొప్పారం, కాసనగోడు, గుడివాడ, కొత్తపేట గ్రామాల విద్యార్థులు, వివిధ పనుల కోసం మండల కేంద్రానికి వచ్చే కూలీలు, ఆయా పరిశ్రమలకు వెళ్లే కార్మికులు వరద వచ్చినన్ని రోజులు ఇంటికే పరిమితం అవుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



వాగులపై నిర్మించిన వంతెనలు తక్కువ ఎత్తులో నిర్మించడంతో భారీ వర్షాలు కురిస్తే వరదనీరు వంతెనల పైనుంచి ప్రవహిస్తుంది. వరద ప్రవాహం తగ్గేంత వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతో రాకపోకలకు అంతరాయం తప్పడం లేదు. వంతెనల ఎత్తును పెంచి ప్రయాణికుల ఇబ్బందులు పరిష్కరించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన ఎవరూ పట్టించుకోవడం లేదు.

– కె.సత్యనారాయణచారి, కొత్తపేట

కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ కాలనీలో పర్యటిస్తున్న చైర్మన్ మందడి సైదిరెడ్డి, కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : కాలనీలో మౌలిక వసతులు కల్పించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని అద్దంకి బైపాస్‌రోడ్‌లోని ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో ఉన్న ఖాళీ స్థలాల్లో క్రీడా ప్రాంగణం, పట్టణ ప్రకృతివనం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలని, స్పెషల్ శానిటేషన్ చేపట్టి కాలనీ మొత్తం శుభ్రంగా చేయాలన్నారు. కాలనీలో తాగు నీటిసౌకర్యం, వీధి దీపాలు, ఇంటినంబర్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ రాములు, డీఈ వెంకన్న, ఏఈ దిలీప్, రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండను నందనవనం చేద్దాం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి నల్లగొండను నందనవనం చేద్దామని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 17వ వార్డులో హరితహారం కార్యక్రమంలో భాగంగా ఆర్జాలబావిలో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు పెంచాలని కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో ఇంటింటికి మొక్కలు పంపిణీ చేస్తామని, మన ఇంటితో పాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ మహేందర్, ఆర్పీ విజయలక్ష్మి, అన్వర్, హనుమంతు, నందు, నాగరాజు, నరేష్, గోపి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈనెల 11న జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కోరివి శంకర్, మునుకుంట్ల గణేష్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్‌ఎస్‌యూఐ నాయకుల ముందస్తు అరెస్టు



చండూరు : పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి : విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు సిద్ధమవుతున్న ఎన్‌ఎస్‌యూఐ మండల నాయకులను శనివారం మండల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అల్లి అంజన్‌కుమార్ యాదవ్, ఉపేందర్, సాయి, ఉదయ్ ఉన్నారు.

చండూరు : అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని టీపీసీసీ ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లడానికి సిద్ధమవుతున్న మండల కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను స్థానిక పోలీసులు శనివారం ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి గిరిబాబు, పట్టణ అధ్యక్షుడు వడ్డేపల్లి భాస్కర్, పన్నాల లింగయ్య, కల్లెట్ల మరయ్య, మాస కృష్ణ, శేఖర్, జావేద్, సర్వాచారి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఖలీల్, జన్ను, సురేష్, శ్రీను, దేవా ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

నార్కట్‌పల్లి : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని ఎన్‌ఎస్‌యూఐ మండల, పట్టణ అధ్యక్షుడు శ్రీపతిగణేష్, తొగరపల్లి నాగరాజు అన్నారు. గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయాలని, విద్యారంగ సమస్యలపై ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శనివారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో దూడల మహేష్, బండరపు సాయిగౌడ్, మహేష్, అంజి ఉన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం



కేతేపల్లి : తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న సర్పంచ్ పార్వతమ్మ, ఎంపీటీసీ సంధ్య



మునుగోడు : మానవహారం చేస్తున్న అంగన్‌వాడీలు, ప్రజాప్రతినిధులు

నల్లగొండ టూటౌన్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణం పరిధిలోని ఆర్జాలబావి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో బీఎల్‌ఓ ఖుర్షీద్‌బేగం, సుగుణ, ఆర్పీ విజయలక్ష్మి, పూలమ్మ, సరిత పాల్గొన్నారు.

కేతేపల్లి : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని కొర్లపహాడ్ సర్పంచ్ ఎడ్ల పార్వతమ్మ, ఎంపీటీసీ ఎడ్ల సంధ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కొర్లపహాడ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మర్రిగూడ : తల్లిపాలతోనే పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని సరంపేట గ్రామ సర్పంచ్ వెనమల్ల వెంకటమ్మమధుకర్ అన్నారు. శనివారం మండలంలోని సరంపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కళమ్మ, ఆశవర్కర్ రాధ మ్మ, స్వాతి, వెంకటమ్మ, యూత్ సభ్యులు రాఘవేందర్, సునీల్, నరేష్, శేఖర్, మల్లేష్ పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలి

మునుగోడు : పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని దీంతో బిడ్డల్లో రోగనిరోధక శక్తి అధికంగా ఉంటుందని సీడీపీఓ కవిత అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో మానవహారం నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మిర్యాల వెంకన్న, ఏసీడీపీఓ వెంకటమ్మ, డాక్టర్ మాధురి, సూపర్‌వైజర్లు రంగమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

శాలిగౌరారం : తల్లిపాలతో బిడ్డలో వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి అన్నారు. శనివారం మండలంలోని ఇటుకుల పహాడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, వైద్యసిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

బీసీ సింహగర్జన సభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీల వెంకటేష్

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే బీసీ సింహగర్జన సభకు జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీల వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింహగర్జన సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హాజరు కానున్నారని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, లోకనబోయిన వెంకట్‌ముదిరాజ్, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరు నారాయణయాదవ్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్, నాయకులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు పూర్తి చేసేందుకు చర్యలు



డ్రెయినేజీ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రమణాచారి తదితరులు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో చేపట్టిన డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ కేవీ రమణాచారి తెలిపారు. శనివారం పానగల్ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చేపడుతున్న డ్రెయినేజీ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. డ్రెయినేజీ పనులు పూర్తి కాగానే వెంటనే రోడ్డు పనులు ప్రారంభిస్తామని, వార్డుల్లో డ్రెయినేజీ పనులకు రూ.4లక్షల చొప్పున మంజూరు చేసినట్లు తెలిపారు. తాగు నీటిని ప్రజలు పొదుపుగా వాడుకోవాలని, నీరు పట్టుకోగానే నల్లా కట్టి వేసి వృథాకాకుండా చూడాలని కోరారు. ప్రకృతి సంపద చాలా విలువైందని, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన వెంట మున్సిపల్, ప్రజారోగ్య శాఖల ఈఈలు రాములు, సత్యనారాయణ, హైవే ఏఈ మురళి, డీఈ వెంకన్న, ఏఈలు దిలీప్, రవీందర్, ఏఈ నాగదుర్గప్రసాద్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీని గెలిపించాలి

నకిరేకల్ : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని టీపీసీసీ నేత దైద రవీందర్ కోరారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పన్నాలగూడెంలో ఇంటింటా కాంగ్రెస్ పార్టీ హామీలు–ప్రగతి సోపనాల ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, దేవులపల్లి వెంకన్న, తాటికొండ వెంకన్న, రామలింగం, కోటయ్య, పరమేషం, జానయ్య పాల్గొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ధర్నాలో మాట్లాడుతున్న పల్లా దేవేందర్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట రెండవ ఏఎన్‌ఎంలు నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. 16సంవత్సరాలుగా పనిచేస్తున్న రెండవ ఏఎన్‌ఎంలను నేటికి రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓ కొండల్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.అరుణ, సరళ, నాగమణి, వసంత, వి.ఉమారాణి, జె.లలిత, ఎం.పార్వతి, పి.రత్నకుమారి, కె.శోభారాణి, పుష్ప, చంద్రకళ, అంగమ్మ, గీత, అండాలు, మంజుల, సరిత, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు



రిలే దీక్షలో కూర్చున్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు: మండలంలోని కిష్టాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడటం సరైంది కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. కిష్టాపురంలో చేపట్టిన ఫార్మా కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారానికి 107 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల నాయకులు దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. అనంతరం సత్యం మాట్లాడుతూ ప్రజల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ఫార్మా అనుమతులు రద్దుచేసి కంపెనీ నిర్మాణ పనులు నిలిపివేయాలన్నారు. అనుమతులు రద్దుచేయకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో చండూరు మార్కెట్ కమిటీ వైఎస్ చైర్మన్ జాజుల అంజయ్యగౌడ్, ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, సర్పంచ్‌లు నందిపాటి రాధారమేష్, మిర్యాల వెంకన్న, యాదవరెడ్డి, అఖిలపక్ష నాయకులు అంజయ్యగౌడ్, వెంకటేశ్వర్లు, కైలాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో పాల్గొన్న జనార్దన్‌గౌడ్, విద్యార్థులు, నాయకులు

నల్లగొండ టౌన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలన్నారు. దీక్షకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, నల్లగొండ వైస్‌ఎంపీపీ జిల్లేపల్లి పరమేష్, కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమళ్ల శంకర్, టీడీపీ నాయకులు ఎల్‌వీ.యాదవ్, బీజేపీ నాయకురాలు శ్రీదేవిరెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల వంశీచంద్‌యాదవ్ మద్దతు తెలిపారు. ఈ దీక్షలో బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షుడు కారింగు నరేష్, యాదగిరియాదవ్, శివకుమార్, రామన్నగౌడ్, మనీ, పృథ్వీ, సౌందర్య, మౌనిక, మనీషా, లక్ష్మి పాల్గొన్నారు.

అక్రమ పట్టాలను రద్దు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామస్తులు

కట్టంగూర్ : అక్రమ పట్టాను రద్దు చేయాలని కోరుతూ శనివారం మండలంలోని మునుకుంట్లకు చెందిన పలువురు గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో సర్వే నంబర్ 597లో నూకల శంకర్‌రెడ్డికి చెందిన ఎకరం 15గుంటల భూమిని 40సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నామని, ఈ భూమిని శంకర్‌రెడ్డి కుమారుడైన రామలింగారెడ్డి 2021లో మునుకుంట్ల గ్రామానికి చెందిన వల్లపు రామలింగయ్యకు 33గుంటలు, సోమనబోయిన మౌనిక పేర 22గుంటల భూమిని 2023లో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ స్వప్నకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు యాదయ్య, నర్సింహ, బక్కయ్య, కడారి శంకర్, లింగస్వామి, రవి తదితరులు ఉన్నారు.

నకిరేకల్‌లో రెండు ఇళ్లలో చోరీ

నకిరేకల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నకిరేకల్‌లో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో వీటీకాలనీలో నివాసం ఉంటున్న రవి ఈనెల 3న తాళం వేసి టూర్‌కు వెళ్లారు. శనివారం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగుల గొట్టి ఉంది. బీరువాలోని 15 తులాల బంగారం, 50 తులాల వెండి ఆభరణాలు,సెల్ ఫోన్ చోరీ చేసినట్లు గుర్తించారు. ఇదే ఇంటి పక్కన ఉన్న రుక్కయ్య శనివారం ఇంటి కి వచ్చే సరికి తాళం పగులగొట్టి ఉంది. అతడి ఇంట్లో కూడా రూ.5వేల నగదు, 10 తులాల వెండి ఆభరణాలు చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో నేడు (ఆదివారం) నిర్వహించే దళిత ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆదిమల్ల శంకర్ అన్నారు. శనివారం తిప్పర్తి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఆదిమల్ల సురేష్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శోభన్‌బాబు, ఆనంద్, వెంకన్న, మాతంగి నవీన్, శివ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

కేతేపల్లి : ఓపెన్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు ఆసక్తి గల వారు ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కేతేపల్లి ఓపెన్‌స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి శనివారం తెలిపారు. వివరాలకు కేతేపల్లిలోని స్టడీ సెంటర్‌లో లేదా 9441339731ను సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రావీణ్యం పొందాలి

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రావీణ్యం పొందాలని ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు విమల అన్నారు. శనివారం పట్టణంలోని డీవీకే రోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కోచ్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చిట్యాల : ఆర్యవైశ్య కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీ మేరకు ఆర్యవైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు.

వడ్డీతో సహా రుణమాఫీ అమలు చేయాలి

కేతేపల్లి : రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను వడ్డీతో సహా మాఫీ చేయాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

జయశంకర్ జయంతిని జయప్రదం చేయాలి

నల్లగొండ టూటౌన్ : ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ శనివారం తెలిపారు. నేడు (ఆదివారం) మున్సిపల్ కార్యాలయం పక్కన జయశంకర్ విగ్రహం వద్ద నిర్వహించే వేడుకలకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిహాజరుకానున్నట్లు తెలిపారు.

సుప్రీంకోర్టు తీర్పుతో న్యాయం గెలిచింది

కేతేపల్లి : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి సూరత్ కోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం గెలిచిందని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు జటంగి వెంకటనర్సయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నకిరేకంటి మంగమ్మ, మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ, జటంగి మల్లయ్య తదితరులు ఉన్నారు.

దళిత బంధు అందించాలని వినతి

మర్రిగూడ : ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకాన్ని అందించాలని దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార గోపాల్ అన్నారు. శనివారం దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీఓ జి.వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో దళిత మోర్చా నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గ్యార యాదగిరి, దేవేందర్, మధు, సుధాకర్, శంకర్ ఉన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నకిరేకల్ : పట్టణంలో వీవీఎం ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో 40మంది విద్యార్థులకు స్థానిక లయన్స్‌సెంటినియల్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యుడు టి.సైదులు సహకారంతో శనివారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ క్లబ్ రిజియన్ చైర్మన్ రవీందర్‌రావు, అధ్యక్షుడు వంటిపాక సోమేష్, డిస్ట్రిక్ చైర్మన్ మారిడి చంద్రశేఖర్, ప్రతినిధులు ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

చిట్యాల : మండలంలోని నేరడ గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు శనివారం ఆ గ్రామ యువజన సంఘం ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు దుబ్బాక వెంకట్‌రెడ్డి, నర్సింహ, తిరుగుడు సన్యాసీరావు, కృష్ణయ్య, నరేష్, రజనికాంత్‌రెడ్డి, గాలీబ్, కోటయ్య పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను వివరించాలి

మునుగోడు : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురిగి నర్సింహాగౌడ్ కార్యకర్తలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దినేష్, నర్సింహ, మహేష్‌గౌడ్, శ్రీను, వేణు, స్వామి, కార్తీక్ పాల్గొన్నారు.

చాడ కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



జన్మదినం సందర్భంగా మొక్క నాటి నీరు పోస్తున్న చాడ కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలో బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా శనివారం తన నివాసం వద్ద మొక్క నాటారు. అనంతరం పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కిషన్‌రెడ్డితో కేక్ కట్ చేయించి గజమాల, పూలమాలలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మహాసభను జయప్రదం చేయాలి

మర్రిగూడ : ఎస్సీ వర్గీకరణ సాధనకై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల చివరి వారంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న, బోడ సునీల్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ నాయకుడు జిల్లా తిరుమలేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 17న మండల కేంద్రంలో నిర్వహించే జిల్లా మహాసభను సైతం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా సమన్వయ కర్త గడపర్తి జానకిరామయ్యచౌదరి, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమిరె స్వామి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గ్యార శ్రీనివాస్, శ్రీశైలం, నాగార్జున పాల్గొన్నారు.